క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

మామిడికుదురు: మామిడికుదురు పెర్ల కాలువ గట్టు రామాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. చైత్ర శుద్ధ సప్తమి ఉదయం 9.27 గంటలకు మృగశిరా నక్షత యుక్త వృషభ లగ్నంలో శ్రీమాన్ సుదర్శనం వెంకట సుబ్రహ్మణ్యం సిద్ధాంతి ఆధ్వర్యంలో వేద మంత్రాలతో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా జరిపించారు. స్వామి వారికి గంధ సిందూరం, తమల పాకులతో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకోదండరామ అభ్యుదయ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రతిష్ఠలో పలువురు భక్తులు పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని, తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

అన్నదానం ట్రస్టుకు విరాళం



దాత సుబ్బారావు దంపతులకు స్వామి చిత్రపటం అందిస్తున్న ఈఓ

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదానం ట్రస్టుకు ఎల్.గన్నవరానికి చెందిన డొక్కా సుబ్బారావు, అన్నపూర్ణ దంపతులు శుక్రవారం రూ.20,032 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజుకు అందజేశారు. విరాళం అందించిన దాతకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. ఈఓ స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. దాత సుబ్బారావు దంపతులను అభినందించారు.

ఆలయానికి ఉత్సవమూర్తుల సమర్పణ



వానపల్లిలో ఉత్సవ మూర్తులకు సంప్రోక్షణ చేస్తున్న దృశ్యం

కొత్తపేట: మండలంలోని వానపల్లిలో వేంచేసిన ఉమా బాలాత్రిపురసుందరీ సమేత వైద్యనాథేశ్వరస్వామి ఆలయంలో నూతన ఉత్సవ మూర్తులకు శుక్రవారం సంప్రోక్షణ నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామానికి చెందిన కర్రి శివ ప్రదీప్‌రెడ్డి దంపతులు వైద్యనాథేశ్వర స్వామి ఆలయానికి ఉత్సవ విగ్రహాలను సమర్పించారు. ఆ విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకుడు వెలవలపల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వేదపండితులు వెలవలపల్లి వెంకటసుబ్రహ్మణ్యశర్మ, విలపర్తి సూర్యనారాయణ శర్మ శిష్యబృందం వాస్తుపూజ, శాంతిహోమం, పుణ్యాహవాచనం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

15న కాలువలకు నీటి సరఫరా నిలిపివేత

కొత్తపేట: ఇరిగేషన్ కాలువలు అన్నింటికీ ఈ నెల 15న నీటి సరఫరాను నిలిపివేయడానికి ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ స్థాయిలో నిర్ణయం తీసుకున్నారని ఆ శాఖ స్థానిక సెక్షన్ ఏఈ వి.నవీన్‌కుమార్ తెలిపారు. ఎస్ఈ ఉత్తర్వులను అనుసరించి ఏఈ నవీన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాగునీరు, సాగునీరు ఇబ్బందులు తలెత్తకుండా ఈ నెల 15 లోపు పంచాయతీల పరిధిలో ఉన్న అన్ని మంచినీటి చెరువులు, పశువుల చెరువులు, రజక చెరువులు సంబంధిత ఇరిగేషన్ కాలువల ద్వారా పూర్తి స్థాయిలో నీటితో నింపుకోవాలని కోరారు. కాలువలలో నీటి మట్టం సరిపోనిచో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని అన్ని చెరువులను నీటితో నింపుకోవాలని సూచించారు.

బాధితునికి వైద్య సహాయం

మలికిపురం: స్థానిక భూపతి వారి పేటకు చెందిన నవయువ నాగభూషణ నగర్ యూత్ ఆధ్వర్యంలో అనారోగ్యం కారణంగా గుర్రం చంద్రమోహన్‌కు వైద్యం నిమిత్తం యూత్ సేకరించిన రూ.70 వేలను శుక్రవారం అందించారు. మలికిపురం సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, తులసీభాస్కరరావు చేతుల మీదుగా అందించారు. చంద్రమోహన్‌కు వైద్య నిమిత్తం సహాయం చేసిన సంఘ సభ్యులందరినీ తులసీ భాస్కర్ అభినందించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

సఖినేటిపల్లి: మండలంలోని మోరి పంచాయతీ వద్ద శుక్రవారం వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో 153 మంది రోగులకు ఆప్తమాలజిస్టులు డాక్టర్ చంటి, డాక్టర్ కరీంలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ల నిమిత్తం 15 మంది రోగులను వైద్యులు సిఫారసు చేశారు. అలాగే 27 మందికి ఉచిత కంటి అద్దాలు అందజేశారు. మిగిలిన రోగులకు సరిపడా మందులను పంపిణీ చేశారు. శిబిరాన్ని శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు పర్యవేక్షించారు. వైద్య పరీక్షలలో వృద్ధులకు తగిన సహకారాలు వారు అందజేశారు.

డ్వాక్రా మహిళల కోసం లోకోస్

- యాప్‌లో సమగ్ర సమాచారం
- నిర్వహణపై సమగ్ర శిక్షణ పూర్తి
- సర్వేపై సందేహాలెన్నో..



ఆలమూరులోని స్త్రీశక్తి భవనంలో యానిమేటర్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

ఆలమూరు: డ్వాక్రా మహిళల సమగ్ర సమాచారం నిక్షిప్తం చేసేందుకు, ఆర్థికంగా చేయూతను అందించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం నేషనల్ రూరల్ లైవ్‌లీ హుడ్ మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) పథకాన్ని అమలు చేస్తుంది ఆ పథకాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇటీవల ఆప్రభుత్వం లోకోస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. అందులో భాగంగా యానిమేటర్లకు ఇప్పటికే యాప్ నిర్వహణ, సేకరించవలసిన సమాచారంపై శిక్షణ జరిగింది. దీంతో కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో యానిమేటర్లు అందరూ డ్వాక్రా మహిళల ఇంటింటికీ వెళ్లి లోకోస్ యాప్‌పై అవగాహన కల్పిస్తూ భవిష్యత్‌లో అందనున్న ప్రయోజనాలను వివరిస్తూ వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 7495 డ్వాక్రా సంఘాలుండగా అందులో 74837 వేల మంది సభ్యులు ఉన్నారు. ఇప్పటి వరకూ సుమారు 30 శాతం మేర సమాచార సేకరణ పూర్తయ్యినట్లు వెలుగు అధికారులు చెబుతున్నారు.

యాప్‌లో మహిళల పూర్తి స్థాయి సమాచారం

ఈ లోకోస్ యాప్ ద్వారా డ్వాక్రా మహిళల సమాచారం క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ నిక్షిప్తం చేసేందుకు వీలుగా సర్వే చురుగ్గా జరుగుతుంది. ఈ నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో లోకోస్ యాప్ ద్వారా సర్వే పూర్తి చేయాలని డీఆర్‌డీఏ అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. యానిమేటర్లు ఒక పక్క దైనందిన విధులు నిర్వహిస్తూనే మరో పక్క లోకోస్ సర్వే చేపడుతున్నారు. అందులో భాగంగా మండల, గ్రామ డ్వాక్రా సంఘాల్లోని సభ్యులు, సభ్యుల వ్యక్తిగత వివరాలతో పాటు బ్యాంకింగ్ ఆర్థిక లావాదేవీలపై యానిమేటర్లు వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారు. డ్వాక్రా సంఘంలో చేరిన నాటి నుంచి చేసిన పొదుపు, తీసుకున్న రుణం వివరాలను సేకరించే పనిలో యానిమేటర్లు నిమగ్నమయ్యారు. అయితే యానిమేటర్లు సేకరిస్తున్న సమాచారం వల్ల ప్రస్తుతం డ్వాక్రా మహిళలకు కలిగే ప్రయోజనమేంటో తెలియజేసేందుకు యానిమేటర్లు కష్టపడుతున్నారు.

డ్వాక్రా మహిళల్లో సందేహాలెన్నో

లోకోస్ సర్వేను జరుపుతున్న సమయంలో డ్వాక్రా మహిళలు నుంచి వస్తున్న అనేక సందేహాలను యానిమేటర్లు నివృత్తి చేయలేకపోతున్నారు. వ్యక్తిగత, బ్యాంకు వివరాలను ఎందుకని కొంత మంది డ్వాక్రా మహిళలు ప్రశ్నించడంతో ఆ ప్రభావం సర్వే పడుతుందని యానిమేటర్లు చెబుతున్నారు. రాబోయే కాలంలో జరిగే ప్రయోజనాల కోసం ఇప్పుడు సమగ్ర సమాచారం తీసుకోవడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అనేకమైన యాప్‌లను ప్రవేశపెట్టి గ్రామ సచివాలయ ఉద్యోగులను వీధి వీధినా తిప్పుతూ ఉంటే మళ్లీ లోకోస్ సర్వే ఏమిటంటూ డ్వాక్రా మహిళలు పెదవి విరుస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

డ్వాక్రా మహిళలకు ప్రయోజనం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోకోస్ యాప్ ద్వారా డ్వాక్రా మహిళలకు అధిక ప్రయోజనం లభిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు నేరుగా డ్వాక్రా మహిళల ఖాతాకే చేరుతుంది. దీనివల్ల ప్రతి డ్వాక్రా మహిళ ఈ లోకోస్ యాప్‌లో వివరాలను నమోదు చేసుకోవాలి.

– ఎం.ధనరాజు, ఏపీఎం, ఆలమూరు

ప్రభుత్వ బడిబాట, బంగారుబాట

సఖినేటిపల్లి: మన పాఠశాల, మనందరి బాధ్యత కాన్సెప్ట్‌లో భాగంగా శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడిబాట, బంగారుబాట అనే కార్యక్రమాన్ని అంతర్వేది దేవస్థానం ఎస్ఎస్ఎస్ టెంపుల్ మోడల్ ప్రైమరీ పాఠశాల స్టాఫ్ నిర్వహించారు. ఈ మేరకు ఎంఈవో–1 డి.కిషోర్ కుమార్ పర్యవేక్షణలో ఫీజులెందుకు దండగ, ప్రభుత్వ బడి ఉండగ, మా మోడల్ ప్రైమరీ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకూ ఇంగ్లీషు మీడియం ఉందని, పాఠశాలలో పిల్లలను చేర్పించండి, భవితకు బంగారు బాట వేసుకోండి అంటూ ఇంటింటా ప్రచారం ఉపాధ్యాయులు చేపట్టారు. సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ చింతా చిన్నా, హెచ్ఎం ఒగ్గు వరలక్ష్మి, టీచర్ పిచ్చుక శ్రీవిద్య, అంగన్‌వాడీ టీచర్ వెంకట లక్ష్మి, విద్యాశాఖ స్టాఫ్ బి.కిషోర్ కుమార్ పాల్గొన్నారు.



అంతర్వేది దేవస్థానంలో ఇంటింటికీ ప్రభుత్వ బడిబాట, బంగారు బాట నిర్వహిస్తున్న విద్యాశాఖ



గోగన్నమఠంలో స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించండి

మామిడికుదురు: పిల్లల్ని ప్రభుత్వ స్కూల్స్‌లో చేర్పించాలని కోరుతూ గోగన్నమఠం గ్రామంలో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఎంఈఓ మోకా వెంకన్నబాబు పర్యవేక్షణలో యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు బావిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి బడి ఈడు పిల్లల్ని ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లు విజయలక్ష్మి, అల్లు సురేష్, ఎస్ఎంసీ చైర్మన్ చింతా శ్రీనివాస్, సీఆర్పీలు సిర్రా మణికుమార్, నాసర్ మొహదీ, ఉపాధ్యాయులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులతో సర్పంచ్ తాతాజీ

ఉన్నత పాఠశాలను సద్వినియోగం చేసుకోండి

మలికిపురం: మండలంలోని గూడపల్లి మెయిన్ కేవీ మెరక ప్రాథమికోన్నత పాఠశాల జెడ్పీ ఉన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ అవుతున్న సందర్భంగా గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సుందర తాతాజీ కోరారు. పాఠశాల విద్యార్థులను చేర్చుకునే నిమిత్తం గ్రామంలో శుక్రవారం ఉపాధ్యాయులతో కలసి ఆయన ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. దీనిలో భాగంగా గూడపల్లి గొల్లమండల వారి గ్రూపు, కృష్ణంరాజు కాలనీ, గొల్లమండల వారి కాలనీ కూడా సందర్శించి తమ పాఠశాలలో పిల్లలను జాయిన్ చేయమని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయని, వసతులు బాగున్నాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు లతో పాటు సుందర బ్రహ్మయ్య, కటికరెడ్డి సత్యనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల యువజన అధ్యక్షులు వీరే..



గొల్లపల్లి స్వరూప్‌రాజ్



జవ్వాది రవిబాబు



మట్ట అనిల్‌కుమార్



గుత్తుల జయరాజ్

కొత్తపేట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం కొత్తపేట నియోజకవర్గంలో ఆ పార్టీ మండల యువజన విభాగాల అధ్యక్షులను ప్రకటించింది. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ చిర్ల జగ్గిరెడ్డి సిఫారసు మేరకు నియమితులైన యువ సారథుల వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట మండలానికి గొల్లపల్లి స్వరూప్, రావులపాలెం మండలానికి జవ్వాది రవి, ఆత్రేయపురం మండలానికి మట్ట అనిల్‌కుమార్, ఆలమూరు మండలానికి గుత్తుల జయరాజ్ నియమితులయ్యారు.

దేశం గర్వించదగ్గ నేత జగ్జీవన్‌రామ్

కొత్తపేట: భారతదేశం గర్వించదగ్గ జాతీయ నాయకుల్లో మాజీ ఉప ప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ ఒకరని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు అన్నారు. శనివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం కళాశాలలో హిస్టరీ లెక్చరర్ సీహెచ్ భవాని ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తిగా, స్వతంత్ర సమరయోధుడిగా, ఉప ప్రధానిగా భారతదేశానికి ఎనలేని సేవ చేసిన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులందరూ పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న వైస్ ప్రిన్సిపాల్

సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉంచండి

మామిడికుదురు: విద్యార్థులను సెల్‌ఫోన్లకు, టీవీలకు దూరంగా ఉంచాలని ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు సూచించారు. నగరం గ్రామంలో శుక్రవారం జరిగిన సాయిదీప్తి స్కూల్ వార్షికోత్సవ సభకు విద్యా సంస్థల అధినేత డీవీవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. విద్యార్థులపై ఎప్పుడూ పనికిరాని వాడు అన్న ముద్ర వేయవద్దన్నారు. ఫెయిల్ అయిన వారు సైతం ఉన్నత శిఖరాలను అధిరోహించారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికి విద్య ఎంతో అవసరమని, విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. దానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఏపీజే అబ్దుల్ కలామ్‌లే నిదర్శనమన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జక్కంపూడి శివ ప్రసాద్, హెచ్ఎంలు జి.మౌనికాదేవి, వై.నాగన్న బాబు, భ్రమరాంబ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

ఒరిగిన ట్రాన్స్‌ఫార్మర్

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు కరెంటు స్తంభం వాలిపోయి విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తోంది. గ్రామంలోని పాటు రేవు (కోడు) పక్కన ఉన్న ఈ స్తంభం మీదుగా హై టెన్షన్ లైను పెదపట్నం లంక గ్రామానికి వెళ్తోంది. స్తంభం కింది భాగంలో విరిగిపోయి ఏక్షణంలో అయినా స్తంభం విరిగిపోయే విధంగా అక్కడ పరిస్థితి ఉంది. ఇది ఏ క్షణంలో అయినా పడిపోయే ప్రమాదం పొంచి ఉన్నా విద్యుత్ శాఖాధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరెంటు స్తంభం ఒరిగి పోవడంతో అక్కడ ఆరు నెలల క్రితం కొత్త స్తంభం పాతారు. కానీ దానికి అవసరమైన కేసారాలు లేక పనులను అసంపూర్తిగా వదిలి వేశారు. కొత్తగా పాతిన స్తంభం అధికారుల నిర్లక్ష్యానికి సాక్ష్యంగా నిలిచింది. ఇక్కడ పొంచి ఉన్న ప్రమాదం దృష్ట్యా సంబంధిత అధికారులు తక్షణం స్పందించాలన్న డిమాండ్ స్థానికుల నుంచి వినిపిస్తోంది. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై నగరం ఇన్‌చార్జ్ ఏఈ వెంకటేశ్వరరావును వివరణ కోరగా వెంటనే అసంపూర్తిగా నిలిపి వేసిన పనులను వెంటనే చేపడతామన్నారు. కొత్త స్తంభానికి కేసారాలు ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను కొత్త స్తంభంపై ఏర్పాటు చేస్తామన్నారు.



బి.దొడ్డవరంలో ట్రాన్స్‌ఫార్మర్‌తో సహా వాలిపోయిన విద్యుత్ స్తంభం

కార్పొరేషన్ రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

కొత్తపేట: బీసీ, ఓసీ, కాపు కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ రుణాలకు సంబంధించి మండలంలో మొత్తం అన్ని వర్గాలకు 132 యూనిట్లు మంజూరయ్యాయి. ఆయా వర్గాల లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆ విధంగా మండలంలో 1,038 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారందరికీ గ్రామాల వారీగా గురువారం, శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించగా లబ్ధిదారులు హాజరయ్యారు. స్థానిక ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఆదిలోనే లబ్ధిదారుల ఎంపిక.. మొక్కుబడిగా ఇంటర్వ్యూలు

టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చేవి స్వల్పమే అయినా ప్రచార ఆర్భాటం మాత్రం ఎక్కువగానే ఉంటుందనేవి అందరికీ తెలిసిందే. అయినా ప్రభుత్వ ప్రకటనలు చూసి, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేసినట్టు ఈ కూటమి ప్రభుత్వం కూడా అమలు చేస్తుందేమోననే ఆశతో లబ్ధిదారులు ఇబ్బడి ముబ్బడిగా దరఖాస్తులు చేసుకున్నారు. ఈ దరఖాస్తులు, ఇంటర్వ్యూలు ఒక ఫార్సు మాత్రమేనని పలువురు కూటమి నేతలే వ్యాఖ్యానించారు. ఈ రుణ సాకర్య పథకానికి నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు మొక్కుబడి మాత్రమేనని, లబ్ధిదారుల ఎంపిక ఆదిలోనే జరిగిపోయిందని పలువురు కూటమి నేతలే వ్యాఖ్యానించారు. అధికార టీడీపీ కోటరీలో నాయకుల సిఫారసుల మేరకు కార్యకర్తలను, వారు సిఫారసు చేసిన వారిని ఆదిలోనే ఎంపిక చేసుకున్నారని చెబుతున్నారు. మిగిలిన వారందరికీ వ్యయ ప్రయాసలు తప్ప ఫలితం శూన్యమని వ్యాఖ్యానించారు.

మద్యం షాపు తొలగించాలి

అంబాజీపేట: మండలంలోని మాచవరం వెంకటేశ్వర కాలనీ, కుసుమేవారిపేట, చినకుసుమేవారి పేటలకు ఆనుకుని ఉన్న మద్యం షాపును తక్షణమే తొలగించాలని సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మాచవరంలో ఏర్పాటు చేసిన మద్యం షాపు వద్దకు ఎంక్వయిరీకి వచ్చిన ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. శివాజీ మాట్లాడుతూ ఈనెల 3న అమలాపురం ఎక్సైజ్ కార్యాలయం వద్ద మహిళలు నిరసన చేపట్టడంతో, ఎంక్వయిరీకి వచ్చారన్నారు. తక్షణం మహిళలకు రక్షణలేని విధంగా ఏర్పాటు చేసిన మద్యం షాపుని తక్షణమే ఇక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఒకపక్క స్కూల్ మరోపక్క అంబేడ్కర్ విగ్రహం ఇరువైపులా గ్రామాలు ఉన్న ప్రజలకు మహిళలకు ఇబ్బందిగా ఉన్న స్థలంలో అక్రమంగా మద్యం షాపును ఏర్పాటు చేయడం హాస్యాస్పదమన్నారు. తక్షణం మహిళలకు రక్షణ లేనటువంటి మద్యం షాపుని ఇక్కడ నుంచి తొలగించాలని లేనిపక్షంలో ఈ మద్యం షాపు ఎదురుగా ప్రత్యక్ష ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

డ్రైడేతో సంపూర్ణ పారిశుధ్యం

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీకాంత్, డి.సాయికిషోర్ అన్నారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలమణి వైద్యసేవలను పర్యవేక్షించారు.

కార్పొరేషన్ ఇంటర్వ్యూలు పూర్తి

ఆలమూరు: మండలంలోని గత రెండు రోజుల నుంచి జరుగుతున్న బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు శుక్రవారం పూర్తయ్యాయి. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 757 మంది హాజరు కావలసి ఉండగా 584 మంది మాత్రమే హాజరయ్యారు. అందులో 173 మంది గైర్హాజరు కావడంతో వారందరికి మరోసారి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ ఎ.రాజు తెలిపారు. అర్హులను ఎంపిక చేసి దరఖాస్తు చేసుకున్న యూనిట్ల మంజూరుకు సంబంధిత బ్యాంకు అధికారులతో మాట్లాడతామన్నారు. సూపరింటెండెంట్ ఎం.మెహెర్ ప్రకాష్, జేఏ షేక్ వలీ, బ్యాంకు మేనేజర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మామిడికుదురు: పాశర్లపూడి కైకాలపేటలో శుక్రవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈదురుగాలికి 216వ నంబర్ జాతీయ రహదారిపై బూరుగు చెట్టు ఒక్కసారిగా కూలిపోయింది. అది బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులపై పడింది. ఈ ప్రమాదంలో బైకుపై వస్తున్న అల్లవరం మండలం సామంతకుర్రుకు చెందిన కోలా నరసింహస్వామి, బొమ్మిడి శ్రీనివాస్ గాయపడ్డారు. పాశర్లపూడి నుంచి మామిడికుదురు వైపు బైక్‌పై వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో గాయపడిన వారిని 108 అంబులెన్సులో అమలాపురం ఆస్పత్రికి తరలించారు. జాతీయ రహదారిపై బూరుగుచెట్టు పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. నగరం పోలీసులతో పాటు స్థానికులు రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

7న జాతీయస్థాయి వెబినార్



వెబినార్ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

రావులపాలెం: స్థానిక డిగ్రీ కళాశాలలో జేకేసీ, ఇంటర్నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 7న జాతీయస్థాయి వెబినార్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ప్రత్యేక స్పీకర్‌గా అసిస్టెంట్ కంట్రోలర్ పేరెంట్స్ అండ్ డిజైన్ రాజీవ్‌గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ నాగపూర్‌కు చెందిన కుమార్‌రాజు వ్యవహరిస్తారన్నారు. విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులు, ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో ఈ వెబినార్ వినియోగించుకోవాలన్నారు

7,8 తేదీల్లో లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు

మామిడికుదురు: ఈ నెల 7, 8 తేదీల్లో సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఓసీ, బీసీ, తదితర కార్పొరేషన్ల ద్వారా అందించే సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న 1813 మందికి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. 7వ తేదీ ఉదయం 10 నుంచి 1 గంట వరకు కరవాక, గోగన్నమఠం, లూటుకుర్రు, ఆదుర్రు, కొమరాడ గ్రామస్తులకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు మగటపల్లి, మాకనపాలెం, గెద్దాడ, ఈదరాడ గ్రామస్తులకు, 8వ తేదీ ఉదయం మామిడికుదురు, మొగలికుదురు, నగరం, పాశర్లపూడి, మధ్యాహ్నం అప్పనపల్లి, బి.దొడ్డవరం, పాశర్లపూడిలంక, పెదపట్నం, పెదపట్నంలంక గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

మోహన్‌కు నంది పురస్కారం



రాజమహేంద్రవరంలో నంది పురస్కారం అందుకుంటున్న మోహన్

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలేనికి చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త నల్లి మోహన్‌కు శుక్రవారం నంది పురస్కారం దక్కింది. ఈ మేరకు పాన్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ప్రముఖ గజల్స్ సింగర్ డాక్టర్ గజల్ శ్రీనివాస్ చేతులు మీదుగా ఆయనకు పై పురస్కారం అందజేశారు. కాగా 180 దేశాలకు సంబంధించి పురాతన నాణేలు, కరెన్సీ సేకరించినందుకు గాను నంది పురస్కారం దక్కడం సంతోషంగా ఉందని మోహన్ తెలిపారు. విశిష్ట అతిథులుగా పాన్ ఇండియా సంస్థ అధ్యక్షుడు అద్దంకి రాజా, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భీమశంకర్



ఆలమూరు: స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాండ్రేగుల భీమశంకరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలమూరు బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ప్రముఖ సీనియర్ న్యాయవాది అంగర బిందు మాధవరావు పర్యవేక్షణ అధికారిగా వ్యవహించి ఎన్నికను నిర్వహించారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా ఆలమూరుకు చెందిన భీమశంకరరావు, ఉపాధ్యక్షుడిగా ఎం.కృపావరం, కార్యదర్శిగా జి.రాజశేఖర్, ఉప కార్యదర్శిగా డి.మహాలక్ష్మి, కోశాధికారిగా ఎ.గోవిందరాజును సహచర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి పలువురు న్యాయవాదులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

ఆలమూరు ఏఎంసీ చైర్మన్‌గా వెంకటలక్ష్మి



ఆలమూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్‌గా జనసేన పార్టీకి చెందిన కొత్తపల్లి వెంకటలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గతలో ఆమె ఆలమూరుల మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిగా 2015–18 మధ్య కాలంలో సుమారు మూడేళ్ల పాటు పనిచేశారు. ఏఎంసీ చైర్మన్‌గా ఎంపికైన వెంకటలక్ష్మికి పలువురు కూటమి నేతలు అభినందనలు తెలియజేశారు.

రెండు తాటాకిళ్లు దగ్ధం

అంబాజీపేట: వక్కలంక చెరువుగట్టు సమీపంలో గురువారం అర్ధరాత్రి గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు చెలరేగడంతో రెండు తాటాకిళ్లు దగ్ధం కాగా మూడు కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముక్కామల సూర్యాకాంతానికి చెందిన గ్యాస్ సిలిండర్ నుంచి ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. దాంతో పక్కనే ఉన్న కేశనకుర్తి లక్ష్మి తాటాకింటికి నిప్పంటుకుని కాలి బూడిదయింది. సూర్యకాంతం ఇంటిలో నివాసముంటున్న ముక్కామల శ్రీనివాసరావుకు చెందిన వస్తువులు కూడా దగ్ధమయ్యాయి. అమలాపురం అగ్నిమాపక అధికారి కేవీఎం కొండబాబు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బాధిత కుటుంబాలను ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, సర్పంచ్ వాసంశెట్టి రేవతి పరామర్శించారు. బాధితులకు అమలాపురం తాలూకా రజక సంఘం ఆధ్వర్యంలో రూ.2 వేలు వంతున గంగలకుర్రు రజక సంఘం ఆధ్వర్యంలో రూ.వేయి వంతున సాయం అందించారు. పలువురు పరామర్శించారు.